# బ్రతుకు జీవుడా!

పి. శ్రీరాములు

అనగా అనగా ఒక నిరుద్యోగి; నిరుద్యోగే కాదు; పట్టభద్రుడు కూడా. గుక్కెడు గంజికి ఆస్కారమయ్యే ఏ చిన్న ఉద్యోగమైనా దొరుకుతుందేమోనని కాలికి బలపం కట్టుకొని తిరిగాడు. ఎక్కడికి పోయినా చుక్కెదురే. తాటికాయంత అక్షరాలతో "నో వెకెన్సీ" బోర్డులు ప్రత్యక్షం. తిరిగి తిరిగి విసిగి వేసారాడు, పాపం, ఏం చేస్తాడు? ఆత్మహత్య చేసుకోవడం వినా గత్యంతరం లేదేమోననిపించింది. అయితే, ఆత్మహత్య చేసుకోవడం ఆత్మవిశ్వాసం కోల్పోయినవారు చేసేపని అని ధైర్యం చెప్పుకున్నాడు. జీవన్మరణాలమధ్య పెనుగులాడైనా ఏదో ఒక పని సాధించి తీరాలనుకున్నాడు.

ఇలావుండగా వాళ్ళవూరు ఒక సర్కస్ కంపెనీ వచ్చింది ఆ కంపెనీ మేనేజరును చూస్తే ఏదైనా ఉద్యోగం ఇస్తాడేమోనని తోచింది అతడికి. వెళ్ళి చూశాడు. మా సర్కస్‌లో పట్టభద్రులు అనవసరమన్నాడు మేనేజరు. జమాఖర్చు లెక్కలు వ్రాసే గుమాస్తాఉద్యోగమైనా ఇప్పించమని కాళ్ళావేళ్ళా పడ్డాడు. లాభం లేదన్నాడు మేనేజరు. ఎంతసేపటికీ ఆ నిరుద్యోగి అక్కడినుంచి కదలకపోతే పొమ్మని కసిరికొట్టాడు. అయినా అతగాడు కదలలేదు. కొంచంసేపటికి ఆ మేనేజరుకే జాలివేసింది.

"ఒక పని చెబుతా చేస్తావా?" అన్నాడు.

"ఏ పనికైనా సిద్ధమే" అన్నాడు నిరుద్యోగి.

"నిజమేనా? అయితే ఒకమాట విను. మా కంపెనీలో వున్న ఒక పెద్ద పులి చచ్చిపోయింది. పులి పాత్ర నటించాలి. ఇష్టమేనా?"

"అమ్మ బాబోయ్— పులి వేషమే!"

"భయపడకు. పులి తోలు కప్పుకో-నాల్గు కాళ్ళమీదా నడిచినట్లు నడువు - సింహాన్ని, నిన్నూ కలిపి వేదికమీదకి తెస్తాము. అంతే," అన్నాడు మేనేజరు.

"తలుచుకుంటేనే గుండె గుభిల్లుమంటున్నది. ఆ సింహం నన్ను మింగేస్తే!" అన్నాడు.

"ఏం ఫరవాలేదు; మేమందరం దగ్గిరే చూస్తూ వుంటాము. ఆ ఉద్యోగం ఇస్తాం; ఇష్టమైతే చెప్పు" అన్నాడు మేనేజరు.

మేనేజరు అంతగా అభయం చెబుతున్నందువల్ల ఆ పనికి ఒప్పుకున్నాడు.

ఆ రాత్రి సర్కస్ ప్రదర్శనం జరుగుతున్నది. ఇక కొత్త పులిని, సింహాన్ని మేనేజరు వేదికమీదికి తీసుకొనివచ్చి ప్రదర్శించే సమయం సమీపిస్తున్నది. పులిపాత్ర అభినయించవలసిన పట్టభద్రుడికి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నవి!

మేనేజరు ఖుద్దున వుండి ముందు సింహాన్ని వేదికమీదికి తెచ్చాడు. ప్రేక్షకలోకాన్ని అది తీవ్రంగా అవలోకనం చేసింది! తర్వాత "పులి"ని తెచ్చాడు పులిపాత్ర అభినయిస్తున్న పట్టభద్రుడికి ముచ్చెమటలు పోస్తున్నవి! బుద్ధి గడ్డి తిని ఈ ఉద్యోగానికి ఒప్పుకున్నానురా భగవంతుడా అనుకున్నాడు తనలో తాను. సింహం తనను మింగివేయడం ఖాయమే ననుకున్నాడు. కాళ్లూ చేతులూ గడగడ వణుకుతున్నయి పులిచర్మానికి వున్న లొట్టకళ్ళలోనుంచి అతి దీనంగా సింహం ముఖం కేసి చూశాడు. సింహంవద్దకు అడుగువేయలేకపోతున్నాడు. మేనేజరు కొరడాతో ఫెడీమని వీపుమీద ఒకటి చరిచాడు. బుద్ధి వచ్చిందన్నట్టుగా "పులి" రెండడుగులు ముందుకు వేసింది. ఎదురుగావున్న సింహం ఇదంతా గమనిస్తూనేవున్నది. పులి తనవద్దకు రావడానికి భయపడుతున్నదని గమనించి, తానే రెండడుగులు ముందుకు వేసి పులి తలదగ్గరికి వచ్చింది. పులి ప్రాణాలు మింటికెగసిపోతున్నవి; నరవాసన పసిగట్టి అమాంతం తనను మింగివేస్తుందనే భయపడ్డది.

ఇంతలో మరొక అడుగు ముందుకు వచ్చి సింహం పులి చెవి దగ్గిర మూతిపెట్టి "మిత్రమా ఎందుకింత భయపడతావ్? నేనూ ఒక నిరుద్యోగపట్టభద్రుడ్నే!!" అన్నది.

★